క్లుప్తంగా

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం


సిద్ధవరంలో ప్రదర్శన ఐసీడీఎస్ ప్రదర్శన

రాపూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాధిక, రాజ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా రాపూరు మండలంలోని సిద్ధవరం, గోనుపల్లి క్లస్టర్ పరిధిలో మంగళవారం బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు 18ఏళ్లు, బాలురు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహాలు చేసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలపై వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించి, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మల్లాం ఆలయంలో విశేష పూజలు

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కుజదోష నివారణ పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఆవు పాలతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మూలం భానుప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణతో విశేష పూజలు నిర్వహించారు. కుజదోషం ఉన్న వారు ఆలయంలో హోమాలు నిర్వహించి తమ దోషం పోవాలని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

చిల్లకూరు: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని ఐసీడీఎస సీడీపీఓ మహబూబి పిలుపు నిచ్చారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాల్య వివాహాలపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం చిన్న పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు క్రిష్ణమ్మ, హెల్పర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలకు సంబంధించి బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ సురేష్ బాబు మంగళవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఎంపీడీఓ సారధ్యంలో బ్యాంక్ అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. మండల పరిధిలో 26 యూనిట్లకు మాత్రమే అబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు.

విలీనం చేస్తే పిల్లల్ని పంపించం

చిల్లకూరు: తమ్మినపట్నం పంచాయతీలోని మత్స్యకార కాలనీకి సమీపంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చి గ్రామంలోని బడులను విలీనం చేసేందుకు వరగలి పాఠశాల హెచ్‌ఎం మరుద్వతి మంగళవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. ఇందులో భాగంగా తమ్మినపట్నం, దళితవాడ, కొత్తెరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయనున్నట్టు తెలిపారు. దీనిపై గ్రామస్తుల అభిప్రాయాలను రాత పూర్వకంగా ఇవ్వాలని కోరారు. దీంతో గ్రామ సర్పంచ్ నెల్లిపూడి సుబ్రహ్మణ్యంతోపాటు మత్స్యకార కాపులు ప్రాథమిక పాఠశాలల విలీనానికి ఒప్పుకోబోమని ఏకగ్రీవంగా తీర్మానం రాసి ఇచ్చారు. ఈ వినతులను ప్రభుత్వానికి పంపుతామని హెచ్‌ఎం తెలిపారు.

కండలేరులో 51.439 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 51.439 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 760, లోలెవల్ కాలువకు 110, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చేసి రూ.10 వేలు మోసం

నాయుడుపేట టౌన్: పట్టణంలోని విక్రమ్ కళాశాల సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్ద వెంకటసుబ్బమ్మ అనే మహిళకు చెందిన ఏటీఎం కార్డు మార్చేసి రూ.10 వేలు డ్రా చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పెళ్లకూరు మండలం అనకవోలు గ్రామానికి చెందిన వెంకటసుబ్బమ్మ మంగళవారం పని మీద నాయుడుపేటకు వచ్చింది. పట్టణంలోని ఏటీఎం వద్ద నగదు తీసుకునేందుకు వెళ్లింది. అప్పటికే అక్కడున్న గుర్తు తెలియని వ్యక్తి నగదు డ్రా చేసి ఇస్తానని చెప్పి ఆమె ఏటీఎం కార్డు తీసుకున్నాడు. పిన్ నంబరు సైతం అడిగి తెలుసుకున్నాడు. అయితే నగదు రావడం లేదని చెప్పి ఆమె ఏటీఎం కార్డు బదులు మరొకటి ఇచ్చేశాడు. కొద్ది కొపటికే తన బ్యాంక్ ఖాతాలో ఉన్న నగదు రూ.10 వేలు డ్రా చేసినట్లుగా మెసేజ్ రావడంతో మోసపోయినట్లు తెలుసుకుంది. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చని పైరు ఉప్పమయం


పచ్చని పొలాల్లో వేసిన ఉప్పు నీటి బోరు


వరి పొలాల్లో అడుగంటిపోయిన బోరు

- రొయ్యల గుంటల కోసం ఉప్పు నీటి బోరు
- లోతుగా వేయడంతో మిగతా బోర్లకు షాక్
- వరి రైతుల పొలాల్లో వట్టిపోతున్న బోర్లు

చిట్టమూరు: మండల పరిధిలోని ఆరూరు గ్రామ పొలాల్లో రొయ్యల గుంతల కోసం వందల అడుగుల లోతు బోరు వేయడంతో పక్కనే వరి పొలాలల రైతులు ఇక్కట్లు పడుతున్నారు. అంత లోతు బోరు కారణంగా వరి పొలాలకు సాగు నీరు సరఫరా చేసే బోర్లులో నీరు రావడం లేదు. ఇతర ప్రాంతాలకు చెందిన కొంత మంది రొయ్యలు గుంటల యజమానులు సన్న, చిన్న కారు రైతుల వద్ద భూములు లీజుకు తీసుకుని రొయ్యలు సాగు చేస్తున్నారు. అయితే అక్కడ నీరు రాకపోవడంతో


ఉప్పు నీరు పారడంతో ఎండిన వరి పైరు

ఆరూరు గ్రామ సమీపంలోని పచ్చని పంట పొలాల రైతుల వద్ద సంవత్సరానికి లీజు చెల్లించి కొంత భూమి తీసుకున్నారు. పక్కన ఉన్న పొలాల కోసం వేసిన బోర్ల కంటే ఎక్కువ లోతులో బోర్లు వేసి పైపు లైన్ల ద్వారా తమ రొయ్యల గుంటలకు నీరు తోలుకుంటున్నారు. అయితే 24 గంటలు ఈ బోరలోనుంచి నీటిని తోడేయడంతో మిగతా బోర్లలో నీరు ఉప్పు నీటి శాతం(సెలెనిటీ) పెరిగిపోయింది.

దీంతో చుట్టు పక్కల ఉన్న మూడు బోర్లలో నీరు అడుగంటింది. దీంతో లక్షలు ఖర్చు చేసి బోర్లు వేసి ఇప్పుడు నీరు రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అలాగే ఈ ఉప్పు నీరు బోరులో నుంచి వెళ్లే పైపులైన్ల ద్వారా లీక్ కావడంతో వరి పైరు ఎండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము నష్ట పోతామని పలుమార్లు చెప్పినా రొయ్యల గుంటల యజమానులు పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే చుట్టు పక్కల ఉన్న సుమారు 200 ఎకరాల కోసం వేసిన బోర్లు కూడా అడుగంటిపోయే అవకాశం ఉంది.అక్రమంగా వరి పంట పొలాల్లో వేసిన బోరును రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు తొలగించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

షిఫ్ట్ లైన్‌మన్ ఆత్మహత్య

ఓజిలి: విద్యుత్ ఉప కేంద్రంలో షిఫ్ట్ లైన్‌మన్ చిల్లకూరు మురళీకృష్ణ(58) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఓజిలి మండలం కురుగొండ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు వివరాల మేరకు నాయుడుపేట పట్టణంలోని రాజగోపాలపురంలో నివాసం ఉంటున్న మురళీకృష్ణ సోమవారం రాత్రి కురుగొండ సబ్‌స్టేషన్‌లో డ్యూటీకి హాజరయ్యాడు. ఈ క్రమంలో రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ప్రతి రోజూ విద్యుత్ సమస్యలపై ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసేవాడు. మంగళవారం ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి మరో లైనమన్‌ను సబ్‌స్టేషన్‌కు పంపాడు. గది లోపల గెడి వేసి ఉండడంతో త కిటికిలో నుంచి చూడగా మురళీకృష్ణ ఉరి వేసుకుని ఉండడానికి గమనించి ఏఈకు సమాచారం అందించారు. ట్రాన్స్‌కో ఏఈ, సిబ్బంది సబ్‌స్టేషన్ చేరుకుని ఆత్మహత్య చేసుకున్న లైన్‌మన్ మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన్నట్లు సమాచారం.

ముత్యాలమ్మ ఆలయంలో వేలం పాటలు

చిల్లకూరు: తూర్పుకనుపూరు శ్రీముత్యాలమ్మ ఆలయంలో ఈ నెలలో జరిగే జాతర సందర్భంగా వివిధ పనుల కేటాయింపునకు మంగళవారం వేలం పాటలు నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో ఆలయ ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో వేలం పాట సాగింది. తలనీలాలు సేకరించుకునే హక్కుకు రూ.4,0100, గెడిపై వేసిన కోడి పిల్లలు ఏరుకునే హక్కు కోసం రూ.27,000, పాదరక్షలు భద్రపరిచే హక్కు కోసం రూ.19,000, సిద్దవరం వైపు పార్కింగ్ రూ.22 వేలకు పాటదారులు దక్కించుకున్నారు. జాతర అనంతరం(ఏడాది పాటుగా) వేయి కళ్ల కుండలు విక్రయించుకునే హక్కుల వేలం పాట రూ.3,01000తో పాడుకున్నట్లు తెలిపారు.

తీరు మారని అధికారులు

గత నెలలో వేలం పాట నిర్వహించే సమయంలో కూడా ప్రస్తుతం ఉన్న పాలక మండలికి కనీస సమాచారం ఇవ్వకనే కూటమి నాయకుల ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. ఈ దఫా కూడా పాలక మండలికి ఈ నెలాఖరు వరకు సమయం ఉన్నప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధి అండతో కూటమికి చెందిన నాయకులు తమదే పెత్తనం అంటూ దేవదాయ శాఖాధికారులను తమ గుప్పెట పెట్టుకున్నారు. పాలక మండలికి సమాచారం ఇవ్వకనే వేలం పాటలను నిర్వహించడం విమర్శలకు దారి తీస్తుంది.


కూటమి నాయకుల సమక్షంలో వేలం పాటలు

ఐటీఐ గదులకు మరమ్మతులు

తడ: పాడుబడ్డ తడ ప్రభుత్వ ఐటీఐ భవనంలో శిథిల స్థితితో ఉన్న 3 తరగతి గదులకు శ్రీసిటీలోని ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్(ఐమాప్) పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో మరమ్మతులు చేసి, ఆధునికీకరించారు. రూ.7.5 లక్షల నిధులు వెచ్చించి మరమ్మతులతోపాటు గదుల్లో డెస్కులు, బల్లలు కూడా సమకూర్చారు. శ్రీసిటీ సీఎస్ఆర్ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐమాప్ ఎండీ టయిజో ఇవామి గదులను లాంఛనంగా ప్రారంభించి, కళాశాల ప్రిన్సిపల్‌కి అప్పగించారు. ఈ సందర్భంగా ఐమాప్ ఎండీ మాట్లాడుతూ స్థానిక విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఐమాప్ మరింత సహకారం అందిస్తుందని తెలిపారు. ఐమాప్ చొరవను శ్రీసిటీ సీఎస్ఆర్ డైరెక్టర్ నిరీషా ప్రశంసించారు.


ఐటీఐ కళాశాల గదుల ప్రారంభంలో శ్రీసిటీ, ఐమాప్ ప్రతినిధులు

అవినీతికి పాల్పడితే ఉపేక్షించం

- రూ.9 కోట్ల ఉపాధి పనుల్లో రూ.4.55 లక్షల రికవరీకి ఆదేశం
- ఏపీఓ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన పీడీ

వెంకటగిరి రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే ఎవరినైనా సరే ఉపేక్షించేదిలేదని పీడీ సీవీ శ్రీనివాస్‌ప్రసాద్ హెచ్చరించారు. వెంకటగిరి రూరల్ మండలంలో రూ.9 కోట్లతో గత ఏడాది నిర్వహించిన ఎన్ఆర్‌ఈజీఎస్ పనులకు సంబంధించి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం 16వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ కొన్ని పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. ఇందులో కె ఉప్పరపల్లి, లాలాపేట, కళవలపూడి, మొగళ్లగుంట ఫీల్డ్ అసిసెంట్లను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలియజేశారు. జరిగిన పనుల్లో రూ.4.55 లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించామన్నారు. ఇందుకు సంబంధించిన నగదు 10 రోజుల్లో రికవరీ చేయాలని ఏపీఓ, పీఓకి ఆదేశాలు జారీ చేశారు.


ఆడిట్ సభలో వివరాలు తెలుసుకుంటున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఏపీఓ పనితీరుపై ఆగ్రహం

వెంకటగిరి రూరల్ మండలం ఏపీఓగా ఉన్న దీప పనితీరుపై పీడీ శ్రీనివాసప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లాలాపేట పంచాయతీలో ఒకరికి బదులు మరొకరు పనులు వెళ్లి నిధులు దుర్వినియోగం చేస్తుంటే ఎందుకు గుర్తించలేకపోయారని ప్రశ్నించారు. పెట్లూరు, మొగళ్లగుంట పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు 8 నెలలుగా పనులు చేయకుండా పోతే వారికి నోటీసులు జారీ చేయకుండా, సస్పెండ్ చేయకుండా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. మొగళ్లగుంట పంచాయతీలో నిర్వహించాల్సిన గ్రామసభను గొల్లగుంట గ్రామంలో నిర్వహించడంపై షోకాజ్ నోటీసు జారీ చేస్తామని, సమాధానం చెప్పాలని ఏపీఓను ఆదేశించారు. విజిలెన్స్ అధికారి శివయ్య, ఏపీడీ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ తంబిరెడ్డి తనూజరెడ్డి, ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఏపీఓ దీప, వైస్ ఎంపీపీ సుధాకర్ పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు ఆర్థిక సాయం

చిల్లకూరు: రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఓ విద్యార్థినికి మంగళవారం ఆర్థిక సాయం అందించారు. ఓడూరు గిరిజన కాలనీకి చెందిన సిద్ధపరెడ్డి రేణుక అనే విద్యార్థిని తల్లిదండ్రులు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. విద్యార్థిని చదువులకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులు పంపిన నగదును ప్రతినిధులు, బాబు, ప్రజేంద్రరెడ్డి, గుండాల లీలావతి తదితరులు అందించారు.


విద్యార్థినికి ఆర్థిక సాయం

సర్వీసు రోడ్డు సమస్యలపై ఎంపీకి వినతి


తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తిని కలిసిన రైతు సంఘం నాయకులు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట జాతీయ రహదారి నుంచి కృష్ణపట్నం పోర్టు వరకు జరుగుతున్న సాగరమాల జాతీయ రహదారి నిర్మాణ పనులు వద్ద రైతు ల పొలాల వద్ద సర్వీసు రోడ్లు లేకుండ చేస్తున్నా విషయమై మంగళ వారం రైతులు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తికి వినతి పత్రం అందించారు. తిరుపతి లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో వారు కలిసినట్లు తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు సాగరమాల రహదారి నిర్మాణ పనులు వద్ద రైతులు ఎదుర్కొంటున్నా సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూడాలని రైతులు ఎంపీకి వివరించారు. రైతులకు న్యాయం జరిగేలా చూడాలని వారు ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం అందించిన వారిలో రైతుల సంఘ నాయకులు జలదంకి వెంకటకృష్ణారెడ్డి, సన్నారెడ్డి హరినాథ్‌రెడ్డి, అన్నమేటి సుధాకర్, కిరణ్, కాలగంధ సునీల్ తదితరులు ఉన్నారు.


రుణాల కోసం ఇంటర్వ్యూలు


బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం హాజరైన లబ్ధిదారులు

నాయుడుపేట టౌన్: మున్సిపాలిటీ పరిధిలో బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకున్నవారందరికీ మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో కమిషనర్ షేక్ ఫజులుల్లా సారధ్యంలో బ్యాంక్ అధికారులు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో 50 యూనిట్ లకు 558 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు. దరఖాస్తుదారులు వారి ఒరిజినల్ ధ్రువ పత్రాలను పరిశీలించి ఎంపికైనా వారి పేర్లను ప్రకటిస్తామని బ్యాంక్ అధిరులు వెల్లడించారు.

బెల్టు షాపులపై దాడులు

వాకాడు: మండలంలోని గ్రామాల్లో అక్రమ బెల్టు దుకాణాలపై మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. కల్లూరు కొత్తపాళెం గ్రామంలో అక్రమంగా మద్యం బెల్టు దుకాణం నిర్వహిస్తున్న రాయపు ఏడుకొండలును పోలీసులు అదుపులోకి తీసుకుని, 10 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ తెలిపారు.


అదుపులో బెల్టు నిర్వాహకుడు

యాజమాన్య పద్ధతులు పాటించాలి

సైదాపురం: రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏఓ హైమావతి కోరారు. మండలంలోని చీకవోలు రైతు భరోసా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.


అవగాహన కల్పిస్తున్న ఏఓ హైమావతి

తూతూమంత్రంగా ఉపాధి తనిఖీ సభ

–రూ.2.45 లక్షలు రికవరీ ఆదేశం

బాలాయపల్లి(సైదాపురం): ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. సమావేశానికి డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు. ఉపాధి తనిఖీ ప్రజావేదికకు అధికారులు, ఉపాధి సిబ్బంది తప్ప జనం రాలేదు. కేవలం తూతూ మంత్రంగా అధికారులు ఈ సమావేశాన్ని ముగించారు. సమావేశంలో ఉపాధి, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలపై రూ.2,45,298 లక్షలు రికవరీ చేసినట్టు తెలిపారు. మన్నూరు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, పిగిలాం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ మస్తానయ్య, భైరవరం ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్ స్వంతంగా రాజీనామా చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ వెంకటయ్యను సస్పెండ్ చేశారు.

ఆరూరు గ్రామంలోని గుంటలో ఉన్న గుర్రపు డెక్క



అల్లుకున్న గుర్రపుడెక్క

చిట్టమూరు: మండల కేంద్రం చిట్టమూరు, ఆరూరు గ్రామాల్లో ఉన్న గుంటల్లో గుర్రపు డెక్క ఆకు అల్లుకోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు గ్రామాల్లో ఉన్న గుంటల్లోని నీటిని గతంలో వేసవికాలంలో పశువులు, గృహావసరాలకు ఉపయోగించుకునేవారు. అయితే ప్రస్తుతం గుంటల్లో మొత్తం ఆకు నీటిపై అల్లుకుపోవడంతో గుంటలోకి దిగే పరిస్థితి లేదు. ఆవులు, గేదెలు, దూడలు గుంటలో దిగితే బయటకు రాలేకపోతున్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా గుంటలోని గుర్రపు డెక్క ఆకును తొలగించి నీటిని వియోగించుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


చిట్టమూరులో గుంటలో నీటిపై పెరిగిన గుర్రపు డెక్క ఆకు

ప్రారంభోత్సవంలో అవమానం!

- దళిత ప్రజాప్రతినిధులకు అందని ఆహ్వానం

వాకాడు: మండల కేంద్రమైన వాకాడులో ఇటీవల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్ర భవన సముదాయం ప్రారంభోత్సవం విషయంలో స్థానిక ఎమ్మెల్యే సాక్షిగా వాకాడు ప్రజాప్రతినిధులైన దళితులకు తీరని అవమానం జరిగిందని వివాదం చెలరేగింది. అధికార పార్టీకి చెందిన కొంతమంది స్థానిక నాయకులకు కొమ్ముకాస్తున్న అధికారులు ఉద్దేశ పూర్వకంగానే ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన సముదాయం ప్రారంభోత్సవానికి ఆహ్వానించ లేదు. కనీసం శిలాఫలకంలో తమ పేర్లు లేకుండా చేయడం అత్యంత దారుణమని వాకాడు–1, వాకాడు–2 ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వాకాడులో రూ.5.5 కోట్లు వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన సముదాయం అప్పట్లో ఎన్నికల కోడ్‌తో ప్రారంభించలేదు. ఈ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గత 27న గూడూరు శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ ప్రారంభించారు. ఆవిష్కరించిన శిలాఫలకంలో వాకాడు 1, కరుణాకర్(గిరిజన), వాకాడు–2 ఎంబేటి గిరి(దళిత) ఎంపీటీసీల పేర్లు అందులో లేకపోవడం విశేషం. వీరిద్దరి పేర్లు విస్మరించి దుగ్గరాజపట్నం ఎంపీటీసీని ప్రత్యేక ఆహ్వానితులుగా శిలాఫలకంలో పేరు రాయడం విమర్శలకు దారి తీస్తోంది. ఇకనైనా గూడూరు శాసన సభ్యుడు పాశం సునీల్‌కుమార్ స్పందించి జరిగిన తప్పిదాలను సరిదిద్దాలని దళితులు కోరుతున్నారు.


దళిత ఎంపీటీసీల పేర్లు లేని ప్రారంభోత్సవ శిలాఫలకం

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


తొణుకుమాలలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


అవగాహన కల్పిస్తున్న రెడ్ క్రాస్ వైద్యులు

చిల్లకూరు: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని స్విమ్స్ వైద్యులు పద్మావతి, హరిత సూచించారు. మండలంలోని చింతవరం పీహెచ్‌సీ పరిధిలోని చేడిమాల, తొణుకుమాల గ్రామాలలో మంగళవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పింక్ బస్సు ద్వారా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింక్ బస్సు ద్వారా మొబైల్ స్క్రీనింగ్ పరీక్షలు చేపడుతున్నామని తెలిపారు. చింతవరం వైద్యులు పాల్ జాన్సన్, సుమ, సర్పంచ్‌లు త్రివిక్రమ భూపతి, పద్మ, కార్యదర్శులు నాగూరయ్య, సిరాజ్, వైద్యసిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గూడూరు పట్టణంలో..

శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో ఉన్న సునీతా సేవా సంస్థ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు లక్ష్మీ మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన కొంత మంది మహిళలకు పరీక్షలు చేసి క్యాన్సర్ లక్షణాలున్న వారిని నెల్లూరులోని ఆసుపత్రికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సులక్ష్మీ, క్యాన్సర్ కౌన్సిలర్ కన్యాకుమారి, వైద్య సిబ్బంది పద్మజ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు భూములు దక్కే వరకు పోరాటం

డక్కిలి: గిరిజనులకు భూములు దక్కే వరకు ఐక్యంగా పోరాటం సాగిస్తామని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల మల్లికార్జున అన్నారు. మంగళవారం మోపూరురోడ్డులో గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ మోపూరురోడ్డులో గిరిజనులపై అటవీశాఖ, పోలీసుల శాఖ దౌర్జన్యంకాండను ఖండించారు. అటవీశాఖ అధికారుల దాడులలో మృతి చెందిన నగిరిపాటి సుబ్రమణ్యం కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆల్తూరుపాడు గ్రామానికి వెళ్తుండగా అటవీశాఖ, పోలీసులు తమను అడ్డుకున్నారని తెలిపారు. దీంతో అటవీశాఖ అధికారులు, ప్రజా సంఘాల నాయకులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న వెంటగిరి సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ శివశంకర్, డక్కిలి తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రజా సంఘాల నాయకులకు నచ్చజెప్పారు. రైతు కూలీ సంఘం నాయకుడు వీవీ రమణయ్య, సీపీఎం నాయకుడు చెంగయ్య, ఎస్టీ సెల్ నాయకులు చలపతి, అంబేడ్కర్ ఐక్య వేదిక ఉపాధ్యక్షుడు భాస్కర్, అట్రాసిటీ కమిటీ సభ్యులు మోపూరు అడివయ్య, యానాదుల సంక్షేమ సంఘం నాయకులు చేంబేటి ఉషా, మానికల మురళీ, సతీష్ చంద్ర, నాగరాజు, శీనయ్య పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మహిళ మెడలో బంగారు సరుడు చోరీ

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని పండ్లురూ గ్రామ సమీపంలో రహదారిపై సుభాషిణి అనే మహిళ నడిచి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలో బంగారు సరుడు లాక్కొని పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలు మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాయుడుపేట పట్టణంలోని గిండివారితోట వీధిలో నివాసం ఉంటున్న ఒబ్బు సుభాషిణి పండ్లూరు గ్రామంలో ఉన్న వారి బంధువుల ఇంటికి ఆటోలో వెళ్లింది. వారి ఇంటికి వెళ్లేందుకు ఆటో దిగి నడిచి వెళుతుండగా వెనుక నుంచి బైక్‌లో వచ్చి మెడలో ఉన్న మూడున్నర సవర్ల బంగారు సరుడు లాక్కొని పరారైనట్లు బాధితురాలు తెలిపింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.